329098701

# ప్రబోధ 25

వేదవిద్యలన్ని వెలయంగ తానేర్చి
నేర్పుమాటలందు నిపుణుడైన
సద్గుణంబులేక సంస్కారి కాకున్న
పదునులేని భూమి పండినట్లు.

భారతీయ విజ్ఞానమునకు మూలాధారము వేదము. ఇది అనంతవిజ్ఞానము. ఇదియె ఇతిహాసపురాణములయందు కూడ నుయిదియే తిరిగి ప్రత్యక్షమవుతున్నది. సంస్కారమునకు, సమత్వమునకు యిది పునాదివంటిది. ధర్మజిజ్ఞాసకు తరగని ఖని. ఆదర్శములు అందించుటకు గొప్పనిధి. ప్రపంచములో ప్రప్రథముగా వెలువడిన కావ్యము వేదము. ఇది భారత జాతి చరిత్రకు ప్రప్రథమైన గ్రంథము. భారతీయుల ప్రమాణములన్నియు కూడను వేదములపైననే ఆధారపడి వున్నది. భారతీయులకు ప్రధానము, ప్రమాణము అయినదే వేదము.

వేద చతుష్టయమునందు ఋగ్వేదము మొట్టమొదటిది. ఋగ్వేదము సాక్షాత్ భగవత్స్వరూపమే. భగవంతుని వర్ణనగావించే విపులమైన ఒక సమూహమైన మంత్రము. ఈ ఋగ్వేదము అనేక దేవతలు కలరని చాటుతూవచ్చింది. నూర్లుకాదు, వేలుకాదు, లక్షలుకాదు, కోట్లు దేవతలకూడిన దేయీప్రపంచమని తెలుపుతూవచ్చింది. దీనియొక్క అంతరార్థము యేమిటి? ప్రతిజీవుడు దేవుడే అనే సత్యాన్ని ప్రకటింపచేస్తూవచ్చింది. కనుకనే ప్రతిమానవునియందు కూడను దివ్యమైన ఆత్మదైవ స్వరూపముగా వుండటంచేత ప్రతిజీవుడు దేవుడనే సత్యాన్ని ప్రకటితము చేసింది. ఈ దైవత్వమనేది కేవలము, వేదమునందుండిన దైవత్వాలు కూడను, మానవాకారములో వున్నవని నిరూపణ చేస్తూవచ్చింది. లోకసంరక్షణ నిమిత్తమై సూర్యుడు ప్రధానుడు. ఇలాంటి సూర్యునకు కూడను కొన్ని రూపములు కలవని నిరూపిస్తూవచ్చింది. సూర్యుని యొక్క కిరణములే వస్త్రములనియు, జ్వాలలే నాలుకలనియు ప్రకటితము చేస్తూవచ్చింది. అగ్నియజ్ఞయాగాది క్రతువులకు అతిప్రధానమైనది. యజ్ఞకాలమునందు అరణి అనే దాని ద్వారా మథనము చేయుటద్వారా అగ్ని ఆవిర్భవిస్తున్నది. ఈ అగ్నికి తల్లితండ్రులు కలరని నిరూపించింది ఋగ్వేదము. దీనిని మథనము చేయుటకు రెండు కట్టెలు వుంటాయి. క్రిందనొక కట్టెపైన నొక కట్టె యీరెండిటి మథనము చేతనే అగ్ని ఆవిర్భవిస్తుంది. కనుక యీ రెండు కట్టెలే అగ్నికి తల్లితండ్రి అని నిరూపిస్తూవచ్చింది. ఈ పుట్టిన తక్షణమే అగ్ని తల్లితండ్రులను మ్రింగునది అని నిరూపిస్తూవచ్చింది. ఈ అరణి మథనం చేత ఉద్భవించటంచేత దీనికి జన్మము అనేకంగా వుంటుందని ప్రబోధిస్తూ వచ్చింది. ఈ అగ్నికి ధూమమే శబ్దము. తన

329098702

యొక్క శబ్దములు ధూమము ఆవిర్భవించటంచేత యితనికి ధూమపాదుడు అనే పేరువచ్చింది. ఈ అగ్నియజ్ఞయాగాదులకు సారథిత్వాన్నివహిస్తుండాడి. దేవతలనుకూడను అగ్నియే తనరథముపైన తీసుకొనివచ్చుచున్నదని ఋగ్వేదము యొక్కప్రమాణము. మానవులు యజ్ఞమునందు అర్పితము చేసే ఆహుతులన్నియు కూడను యీ అగ్ని ద్వారానే దేవతలకు అందింపచేస్తున్నది. ఇక్కడ దేవతలకు, అగ్నిఅందించే ఆహుతులకు వున్నసన్నిహిత సంబంధమేమిటి? ఈ అన్నింటిని తాను స్వయముగా ఒకవిధమైన అధికారస్థానము వహించి యజ్ఞయాగాదిక్రతువులకు తాను మూలాధారమై నిల్చటంచేత యీ అగ్నికే బ్రహ్మ అని ఋత్విక్కులు పేరుపెట్టారు. ఇంతేకాదు యీ అధికారత్వము వహించటంచేత హోత అనికూడ పిలుస్తూవచ్చారు. కనుక అగ్నికి అనేకపేర్లతో యీ యజ్ఞమునందు ఆహ్వానముచేస్తూవచ్చారు యీ ఋత్విక్కులు.

ఈ అగ్ని మానవునికి అనేకవిధములైన సంబంధములు కలిగివుంటున్నది. అగ్ని లేక మానవుడు ఒకక్షణమైనా కూడను తన జీవితాన్ని గడపలేడు. తెల్లవారిలేచినది మొదలు యింటిలో అగ్నితో ప్రారంభమవుతుంది. తాను భుజించే ప్రతి ఆహారం కూడను పరిపక్వముగావించుకుంటున్నాడు. ఇంటియందు, వంటియందు కూడను అగ్నియే ప్రధానము. ఆధారము. అంతరార్థమయేమిటి? అగ్నిలో ఆహుతి చేస్తున్నారు పదార్థములు. ఈ అగ్ని దేవతలకు అందించుచున్నదని ఒకప్రమాణము. ఇక్కడ మానవుని జీవితములో దీనియొక్కప్రధానమైన ఆధారము విచారించినప్పుడు మన జఠరాగ్నియే యిందులో హోమగుండము. ఇందులో వేసిన సమస్తపదార్థములు కూడను భస్మముగావించి రసస్వరూపమైన రూపాన్ని ధరింపచేసి సర్వాంగములకు కూడను సరఫరాచేస్తూవచ్చింది.

ఉపనిషత్ వాక్యప్రమాణము ననుసరించి 'రసోవైసః' భగవంతుడు రసస్వరూపుడు ఈ రసము మానవుని యొక్కప్రతీ అంగమునందు కూడను యీ రసము నిండివుంటున్నది, చేరివుంటున్నది. అందువలననే దీనికి అంగీరసుడు అని పేరుపెట్టారు. ప్రతిఅంగమునందు రసస్వరూపుడై పరమాత్ముడు వుండటంచేతనే యితనికి అంగీరసుడు అని పేరు. ఈ రసస్వరూపము యెచ్చటనుండి వచ్చినది. జఠరాగ్ని. ఈ అగ్నిద్వారానే యీ రసమయమైన స్వరూపాన్ని యీ అంగములంతా కూడను సరఫరా చేస్తూవచ్చింది.

అదేవిధముగనే యోగమునందు అర్పితంగావించిన పదార్థములను రసమయముగా మార్చి యీ అగ్ని అనే ధూమముద్వారా యావత్ప్రపంచమునకు కూడను ప్రసరింపచేస్తూ వస్తున్నాడు. ఇట్టి అంతరార్థమును ప్రబోధించే నాయకులు లేకపోవటంచేతనే యజ్ఞయాగాది క్రతువులు హాస్యాస్పదముగా తయారౌతూవచ్చాయి. ఇంతేకాదు. ఆనాటి వేదకాలములో వుండిన సహనము, సానుభూతి, సమత్వమనే దానిలో వెంట్రుకంత ఒక్కభాగమైనా కన్పించటంలేదు. వేదము మహోన్నతమైన తత్వాన్ని ప్రబోధించింది. అభిన్నత్వాన్ని ప్రకటితంగావించింది. ఏకత్వమే దీనికిప్రధానమైన లక్ష్యమని తెలుపుతూవచ్చింది.

శాంతిమంత్రమునందు

329098703

ఓం సహనావవతు సహనౌభునక్తు
సహవీర్యం కరవావహై
తేజస్వినావధీతమస్తు మావిద్విషావహై
ఓం శాంతి శాంతి శాంతిః.

దీనియొక్క అంతరార్థమేమిటి.

కలసి మెలసి తిరుగుదాం కలసి మెలసి పెరుగుదాం.
కలసి మెలసి కలిమి చెలిమి బలమూ గుణమూ పెంచుదాం
కలసి మెలసి తెలుసుకున్న తెలివిని వెలిగించుదాం
కలసి మెలసి కలిమితోడ చెలిమిగ జీవించుదాం
శాంతి శాంతి శాంతి యనుచు శాంతిపూజ చేయుదాం

కట్టకడపటికి శాంతి శాంతి శాంతి యని శాంతిని దేశానికి పంచుదామని. కనుక మానవత్వమనే యొక్కత్వాన్ని ఋగ్వేదము స్పష్టముగా నిరూపిస్తూ వచ్చింది. సంకుచితమైన బుద్ధులను కలిగినవారు స్వప్రయోజనాల నిమిత్తమై దీనిని దుర్వినియోగించుకొనేవారు, యనేక భేదములు కల్పించి, భిన్నత్వాన్ని నిరూపిస్తుంది వేదమని ప్రకటితంగావిస్తూ వచ్చారు.

వేదములో యట్టి భేదము లేదు. వేదము కేవలము సమత్వాన్ని, సానుభూతిని యిలాంటి పవిత్రమైన సుగుణాలిని కూడను ప్రకటితం చేస్తూ వచ్చాయి. వేదములో ప్రధానమైనది ఋగ్వేదము. ఈ ఋగ్వేదమే సర్వవేదములయందు కూడను తనస్వరూపాన్ని ప్రకటితంగావిస్తూ వచ్చింది. అథర్వణవేదము లోపల యీ ఋగ్వేదము యొక్క తత్వములు, సూక్తులు వెయ్యిన్నిరెండు వందల యిరవై సూక్తులు యిందులో చేరివుంటున్నాయి. నాలుగు వేదములందు కూడను ఋగ్వేదము ఒకసమత్వాన్ని నిరూపిస్తూ వచ్చింది. సామవేదములో వున్న సూక్తులన్నీ కూడను ముక్కాలుభాగము ఋగ్వేదములోనివిగానే కన్పిస్తున్నాయి.

యజుర్వేదములో వుండిన మంత్రములన్నియు యీ ఋగ్వేదము యొక్క మంత్రములుగానే నిరూపిస్తూ వచ్చింది. యజుర్వేద, సామవేద, అథర్వణవేదములలో కూడను ఋగ్వేదము సమత్వాన్ని వహిస్తూ వచ్చింది. అందుకే ఋగ్వేదమును ప్రధానమైన అంగముగా భావిస్తూ వచ్చారు ఆనాటి ఋషులు. ఋగ్వేదము కేవలము భగవంతుని యొక్క స్తుతిని గావించే మంత్రస్వరూపము.

సహస్రశీర్షాపురుషః సహస్రాక్షః సహస్రపాత్ అనగా యీ వేలాది శిరస్సులు, వేలాది నేత్రములు, వేలాది పాదములు అన్నియు కూడను తనవే అని స్పష్టము చేస్తూ వచ్చింది. ప్రతిమానవుడు మాధవాకారుడే. కాని యింద్రియముల చేత సంపర్కము పొంది తనస్వరూపాన్ని మరచి దేహమే తనని విశ్వసించి యీ అజ్ఞానమునకు గురి అవుతున్నాడు. ఈ దేహేంద్రియ భావము క్రమక్రమేణా తొలగించుకున్నప్పుడే తాను ప్రత్యేకమైన అనుభవమును అనుభవించనక్కరలేదు.

329098704

తాను తానుగానే నిలచివుంటాడు. ఇట్లు అనేకత్వములోని యేకత్వము నిరూపించేదే వేదము. మీరు చెప్పకూడదు. మీరు పల్లించాలి. మీరు దీనికి అర్హులు. మీరు దీనికి అర్హులు కాదు అని నిర్ణయించే అధికారము యెవ్వరికిని లేదు. ఆనాటి మానవులయందు యీనాటి కుల వర్ణ మత వర్గములనేవి యేమాత్రము లేవు. నేడు కూడను యిది లేనిదే. కాని కొంతమంది సంకుచితమైన భావము కల్గినవారు దీనిని అనేక విధములుగా వారు ప్రోత్సహించి, పోషించి, దీనిని యనేక విధములుగా విభజిస్తూ వస్తున్నారు. పంచభూతములు పరమాత్మస్వరూపములు. పరమాత్మునికే భేదము లేనప్పుడు యీ జీవాత్మకెందుకు భేదము. పరమాత్మకు యిట్టి కులములు లేవు. మతములు లేవు. పరమాత్ముడు అంతటా వున్నాడు. అంతము లేనివాడు. ఈ పంచభూతములకు యేవిధమైన తెగలు లేవు. నీటిదే మతము? నిప్పుదే కులము? గాలిదే కులము? గగనానిదే కులము? వీటిని యేకుల రహితముగా అనుభవిస్తున్నామా లేదా? నీరు త్రాగే ముందు నీరుదే కులము అని యెవరైనా విచారించి త్రాగుతున్నారా?

కేవలము యీ దేహేంద్రియములయొక్క భేద భావముతో యీవిధమైన సంకుచిత భావములను అభివృద్ధిపరస్తూ వస్తున్నాయి. ఈ కర్మనిష్ఠయందు కావించే పనులన్నీ కూడను యేకత్వాన్ని అభివృద్ధిపరస్తూ వస్తున్నాయి. కనుక యీనాడు మనము యిట్టి భేదములకు కూడా అవకాశము నందించరాదు. దైవము ఒక్కడే. దేహములనేకము. అనేకమునందు యేకత్వమైన దైవత్వాన్ని మనం విశ్వసించాలి. ఇట్టి ఐకమత్యాన్ని మరు సంపాదించినప్పుడే దివ్యత్వమైన ఆత్మతత్వాన్ని అర్థం చేసుకోగలుగుతాము. ఐకమత్యం చెదరిపోవటంచేతనే ఆత్మతత్వము దూరమవుతుంది. త్యాగభావములు దూరంకావటంచేత రోగభావములు పెరిగిపోతున్నాయి. కనుక నే త్యాగభావాన్ని మనము ప్రత్యేకమైన రీతిలో అనుసరించాలి.

ప్రపంచమునందు కొన్ని రకములుగా మనము విచారణ చేసినప్పుడు యివి గుణములచేత యేర్పడినటువంటివిగా మనకు అర్థమవుతూ వస్తున్నాయి. ప్రపంచము త్రిగుణాత్మకమైనది. ప్రకృతియందు ఆవిర్భవించిన మానవునకు కూడను త్రిగుణములు ప్రధానము. అయితే ఏ ఏ గుణాలకు, ఏ ఏ కాలములో, ఏ ఏ సందర్భములలో, యే యే అవకాశములందు యేవిధమైన అర్హతనందించాలో అది మనం విచారణ చేయాలి. గుణములున్నవి కదా యని విచ్చలవిడిగా దీనిని స్వేచ్ఛగా విభజన చేయరాదు. నలుపు తమోగుణమన్నారు. ఎఱుపు రజోగుణమన్నారు. తెలుపు సాత్వికమన్నారు. ఇవన్నియు ప్రతినిత్యము సూర్యోదయముతోనే మనము అనుభవిస్తూ వస్తున్నాము. సూర్యోదయమునకు పూర్వము నలుపు. ప్రపంచమంతయు కూడను అంధకారము క్రమ్మివుంటుంటాది. అది క్రమక్రమేణా పైకి వచ్చే కాలది యెఱుపుగా మారుతుంది. ఆ ఎఱుపు రంగే తీక్షణమైన స్థితిని ధరించే సమయములో తెలుపుగా మారిపోతుంది.

దీనిని ఆధారం చేసుకొని పుట్టుటకు పూర్వము ప్రతి ఒక్కడు శూద్రుడే. నలుపే. తమోగుణమే. పుట్టగనే రజోగుణము. అనగా ఆకలిదప్పులకు, ఆనందవిహారములకు అభిలషిస్తుంటాడు. కోరికలతో కట్టుబడుతుంటాడు. దీనికి మతి, స్థితి, యేవిధమైన గతి కూడను వానికి తెలియదు. తన

329098705

యుక్తస్థితిని మాత్రమే తాను చూసుకుంటాడు. స్వార్థము, స్వప్రయోజనములకై పాటుపడుతుంటాడు. కోరికలచేత కట్టుబడి వుంటాడు. ఈ ఆశలు, వాంఛలు అభివృద్ధిగాంచటంచేతనే రజోగుణంలో ప్రవేశిస్తున్నాడు. క్రమక్రమేణా యీ వాంఛలను మనం కొంతవరకును అణగద్రొక్కుతూ రావటంచేత దైవభావాన్ని మనయందు అభివృద్ధిగావింప చేయటంచేత, లోకవాంఛలు సన్నగిల్లి, దైవభావమును వశింప చేసుకుంటాడు. అప్పుడే వీడు సాత్వికరూపాన్ని ధరిస్తాడు. కనుక తమోగుణ, రజోగుణములు, సాత్వికమైన భావములో కూడి మన దేహమునందే వుంటున్నవి. దైవమెక్కడ వున్నాడు. మన కనుచూపులోనే వుంటున్నాడు. ఆ దైవము ఆవిర్భవించటానికి కనుచూపులో కూడను సత్వ రజో తమో గుణములు ప్రకటితమవుతున్నాయి.

మన కన్నులో ముక్కాలు భాగమంతా కూడను నలుపుగానే కనిపిస్తున్నది. ఈ నలుపుకు ఆధారమైన తెలుపే సాత్వికమైన తెల్లగుడ్డుగా వుంటున్నది. అయితే యీ నలుపుకు తెలుపుకు కొస భాగమునందు ఎరుపు అనే రజోగుణము అప్పుడప్పుడు ప్రకటితమవుతున్నది. సృష్టికంతయు కూడను మూలాధారమైనది నేత్రము. నేత్రమునందే త్రిగుణములు కూడి వుంటున్నాయి. ఈ విధముగా ఋగ్వేదమునందు ఒక్కొక్క పదమునకు, ఒక్కొక్క సూత్రమునకు, ఒక్కొక్క మంత్రమునకు వుండిన పవిత్రతను విచారణ చేస్తే యివన్నీ కూడను మానవాకారమునందే వుంటున్నవి.

కనుకనే మన దేహమే ఒక యంత్రము. మన ఉచ్ఛ్వాస నిశ్వాసములే మంత్రము. ఇదియే భగవంతుని యొక్క గమనం ఆగమనం అని. ఈ వుచ్ఛ్వాస నిశ్వాసములే వేదములని చెప్తూ వచ్చారు. కనుక యీ గమన ఆగమనములు అంతా ఉచ్ఛ్వాస నిశ్వాసములు అదియే మంత్రస్వరూపము మన హృదయమే వీటి అన్నింటికినీ తంత్రము. దేహమనే యంత్రమునందు, హృదయమనే తంత్రమునుంచి శ్వాస అనే మంత్రములు ప్రకటితమవుతున్నాయి.

నిరంతరము మనము భగవంతుని ప్రార్థించే రాగతాళముతో కూడిన భావములే సామవేదము. మనము నిత్యపూజలో పల అష్టోత్తరము, సహస్రనామార్చన యిలాంటి అర్చనలంతా జరుపుతున్నాము. ఈ మంత్రములతో కూడిన అర్చనలే ఋగ్వేదము. కానీ మనయందున్న దుర్గుణములను దురాచారములను, దుష్ప్రవర్తనలను త్యాగము చేయటానికి పూనుకుంటుంటారు. ఇది సరైన యజో మంత్రస్వరూపము. మనలను ఆవరించే ఆపదలను, దుఃఖములను యెదుర్కొని వాటితో పోరాడి, వానిని జయించటానికి తగిన కృషి చేస్తుంటాము. ఇదే అథర్వణవేదము. కనుక సామవేద, యజుర్వేద, అథర్వణవేదములన్నీ కూడను మానవునియందే యిమిడి వుంటున్నవి. దైవమెక్కడ అని నీవు వెతుకులాడనక్కరలేదు. తనయందే వుంటున్నాడు దైవము అనే సత్యాన్ని యీ ఋగ్వేదము ప్రకటితం చేస్తూ వచ్చింది. అయితే మానవుడు బహిర్దృష్టి కల్గివుండటంచేత బహిర్ముఖమైన కర్మలు ఆచరించి తద్వారా అంతర్ముఖానికి తాను ప్రవేశించటానికి యీ విధమైన చర్యలన్నీ కూడను, యజ్ఞయాగాది క్రతువులన్నీ కొంతవరకు సార్థకమవుతూ వచ్చాయి.

ఏదో ఒక విధమైన కర్మాచరణము ద్వారా జగత్తునకు యీ వేదములను ప్రకటి

తము చెయ్యాలి. సామాన్యమైన మానవులు, పామరులైన మానవులు, వేదమంటే యేమిటో తెలియని మానవులకు యీ విధమైన యజ్ఞయాగాది క్రతువుల ద్వారా ప్రకటితం చేయించాలి. ఏ విధమైన జ్ఞానము, ఏ విధమైన విజ్ఞానమును, శాస్త్రములు యెరుగనటువంటి గోపికలు కూడను యేదో తమ భావము లోపల వేదములుగా భావించుకున్నారు. క్షీరాన్ని వేదసారముగా భావించారు. గోవులన్నియు ఉపనిషత్తులుగా భావించారు. తమ జీవతత్వమునే దూడగా భావించారు. గోవునుండి వచ్చే నాల్గు భావములు కూడను వేదసారములైన క్షీరములుగా విశ్వసించారు. నాల్గు వేదముల సారమే యీ క్షీరమని విశ్వసించారు. ఆ క్షీరములయొక్క చిలికయే గానమనుకున్నారు. ఇదియే వేదసారమని విశ్వసించారు. కృష్ణుని ప్రార్థించే సమయములో కూడను యీ విధమైన అంతరార్థమును పురస్కరించుకొని కృష్ణుని ప్రార్థిస్తూ వచ్చారు. కృష్ణా ఒక్కతూరి నీ వేణుగానము వినిపించవా అని ప్రార్థించారు.

పాట పాడుమా కృష్ణా! పలుకు తేనెలొలుకు నటుల
మాటలాడుమా ముకుంద! మనసు తీరగా.... ॥పాట॥
వేదసారమంత తీసి నాదరూపముగను మార్చి
వేణువందు తిరుగబోసి గానరూపముగను మాకు. ॥పాట॥

అదే రసోవైసః. ఏది రసమును గానముగా మార్చి మనోరసములో లీనముగావించే యదార్థమైన, దివ్యరసమైన భగవత్ పరముగా రూపొందింపచెయ్యాలి.

సర్వగానములకు సామగానమే ప్రధానమైనది. కానీ యీనాడు ఆ గానమునందున్న రాసులు యే మాత్రము మనకు కనుపించటము లేదు. ఈ గానమునకు తగిన భావములు యీ సామవేదమునందున్న సంసిద్ధమైన సూత్రములు మనకు కనుపించటం లేదు. ఎక్కడ వేయిపన్నములు యెక్కడ వేయి శాఖలు ఈనాడు రెండు శాఖలుగా వుంటున్నాయి అంటే యింక యెన్ని శాఖలు మనము కోల్పోనామో. కనుక క్రమక్రమేణా కూడను వీటిని మనము పోషించుకొనకుండిన యీ వున్న కొన్ని కూడను మనము యేనాడో పారవేసుకుంటాము. యీనాడే మానవత్వము, దానవత్వముగా, పశుత్వముగా మారిపోతూ వస్తుండది. ధర్మశాస్త్రములు, ప్రేమశాస్త్రములు, జ్ఞానశాస్త్రములు యీనాడు కరవైపోయినాయి.

ప్రతి మానవుడు జన్మించినది మొదలు మరణించేవరకు వేదప్రమాణమునే అనుసరిస్తూ వస్తున్నాడు. తెలిసినా తెలియకపోయినా యేదో ఒక ఆచారము క్రింద మనము భావించి దానిని అనుసరిస్తూ వస్తున్నాము. ఈ నామకరణము వేదశాస్త్రము యొక్క ప్రమాణమే. కేశఖండనము కూడను వేదము యొక్క ప్రమాణమే. చెవులు కుట్టటం, ఉపనయన సంస్కారము, కళ్యాణము యివన్ని వేదము యొక్క ప్రమాణమే. అక్కడ కూడను యీ ఋగ్వేదమునందున్న ధర్మేచ, అర్థేచ, కామేచ నాతి.... అనగా యేటుటి యీ ధర్మార్థకామములకు మాత్రమే యీ యొక్క వేదము బోధిస్తున్నది. మోక్షము బోధించటానికి దీనికి అధికారము లేదు అని వేదమే చెబుతున్నది. మోక్షము కేవలము దైవానుగ్రహముచే లభించేది. అద్వైత భావమును అనుభవించినప్పుడే మోక్షము మనకు లభిస్తుంది. ఈ అద్వైత జ్ఞానమే సరియైన

329098707

జ్ఞానము. అద్వైత దర్శనం జ్ఞానము. అనగా యేమిటి అనేకత్వమునందు యేకత్వదృష్టిని మనము అభివృద్ధి పరచుకోవాలి. అందరూ దైవస్వరూపులే. విశ్వం విష్ణుస్వరూపం. సర్వం ఖల్విదం బ్రహ్మ. అంతటి తత్వాన్ని మనము క్రమక్రమేణా పెంచుకుంటూ రావాలి. కానీ చాలా మంది ప్రయత్నిస్తాం ప్రయత్నిస్తాం అంటారు. Try Try Try అంటే అది dry అయిపోతుంది. Must do చేసే తీరాలి మనము. కనుక యే ఒక్క విషయానికి మనము ప్రయత్నిస్తాం అని యే మాత్రము చెప్పకూడదు. అది ఒక బలహీనత.

మీరు చాలా మంది కనిపెట్టారో లేదో స్వామి యేది చెప్పినా యిది చేస్తా, చెయ్యను అనిఖండితంగా చెప్తాను గాని, చూస్తా అనేది నా నుంచి రానేరాదు. కనుక My Life is my message నన్ను అనుసరించండి. చేస్తాం అనే ధృఢమైన వాగ్దానము చెయ్యాలి. ఎవరి కోసం. నీకోసమే. కనుకనే ప్రతివిషయమునందు యీ విధమైన దీక్షను మనము పట్టినప్పుడే కార్యాన్ని మనము ఫలింపచేసుకుంటాము. ఎంతకాలమైనా చూస్తాం చూస్తాం అని పోతుంటుంటే ఎప్పుడు చూచేది. కనుక మనము చూస్తాము అనే మాట వద్దు. చేస్తాం అనే ధృఢమైన విశ్వాసముతో మనము పూనుకోవాలి. అదే విశ్వాసము. ఆ విశ్వాసమే మన శ్వాసము ఆ విశ్వాసము లేకపోతే శ్వాసము లేని శవమే. మంచి దానిని విశ్వసించాలి. చెడ్డ దానిని తీసి పారవెయ్యాలి. ఈ విధమైన నిత్యానిత్య విషయ పరిశీలన జరపాలి. ఈ పరిశీలనా శక్తిని ప్రబోధించేది, ప్రసరింప చేసేది యీ ఋగ్వేదము. ఇష్టాన్ని బలపరచి అయిష్టాన్ని దూరము గావించటమే యీ వేదము యొక్క పని. ఇట్టి పవిత్రమైన వేదములందు, యింత పవిత్రమైన సారము కలిగివున్నదనే సత్యము ప్రతి ఒక్క వ్యక్తి కూడను గుర్తించటానికి ప్రయత్నించాలి.

గాలి మొదలు, నీరు మొదలు, శబ్దము మొదలు ప్రతి విషయాన్ని కూడను యీ వేదము అన్ని విధాలా అనుగ్రహిస్తూ వచ్చింది. దానినే మానవుడు చమే చమే చమే అని కోరుతూ వస్తున్నాడు. ఈ వేదమునందు రెండు విధములైనవిగా వుంటున్నాయి. నమకము, చమకము చమకమంతా కావాలి కావాలి కావాలి నాకు అన్నీ కావాలి. దాహమైపోతుంది. కొంచెం నీరు కావాలి. ఆ నీరు యిస్తే అంతటితో తృప్తిపడడు. ఒక cool drink కావాలి. ఆ cool drink యిస్తే తృప్తి పడడు ఒక ice cream కావాలి. ఈ విధముగా ఆశలు పెరుగుతూ పెరుగుతూ పోతూ వుంటుంది. కనుకనే యీ వేదములో చమకము లోపల ఓ భగవంతుడా నాకు చల్లని గాలి అందించు. ఆ గాలి కూడను నాకు యెంత కావాలో అంతే అందించు. ఉక్కిరి బిక్కిరి అయ్యే రీతిగా నాకు అందించకూడదు. నాకు చక్కని రుచికరమైన ఆహారము నందించాలి. ఈ ఆహారము అజీర్ణము చేయకూడదు. నాకు అనాయాసముగా వుంటుండాలి. ఆయాసము కలిగించకూడదు. ఈ విధమైన రీతిగా వేదము తెలిన వారి నడగండి, చమకములో అన్నీ యిలాంటివే వుంటున్నాయి. కోరికలు. కోరికలు. కోరికలు. నమకము కేవలము భగవత్ ప్రార్థన. నమ నాకు వద్దు. నీవే కావాలి. కనుక నీ యొక్క సంకల్పము, నీ యొక్క ప్రేమ, నీ యొక్క జ్ఞానము, నీ యొక్క దర్శనము, నీ యొక్క స్పర్శనము యివి మాత్రమే నాకు కావాలి. నీ నిమిత్తమై ఆచరించే మంత్రములే నమకములు. ఇలాంటి నమక చమకములతో వుండిన తారతమ్యాన్ని ప్రజలకు

బోధించలేకపోతున్నారు. మొదలు కోరవలసినదే. తరువాత విసర్జించవలసినదే. ఈ కోరిన తరువాత, అనుభవించిన తరువాత విరక్తి మనలో ఆవిర్భవిస్తుంది. కనుక కోరవలసినవి కోరండి. ఈ కోరికలు కూడ అదుపులో పెట్టుకోండి. నక్షేయోనియమంబివా. ఈ నియమమే లేకపోతే మన జీవితము చాలా బాధలకు గురౌతుంది. కోరికలు వుండకూడదని చెప్పటం లేదు. అవసరమైనవి కోరండి. కానీ సాధ్యమైనంతవరకు యీ కోరికలు తగ్గించుకొని దైవాన్ని అధికముగా మీరు రమించండి.

దైవమే మన చెంత వుంటుంటే సర్వము మనకు లభ్యమౌతుంది. దైవమే దూరమైతే మనము సర్వము దూరము చేసుకున్నవారమౌతాము.

నీకే కానివాడనైతే లోకమాతా
నేను లోకమందు లోకువౌదు లోకమాత

లోకమాతకే మనము లోకువైపోతే యింక లోకములో మనము యేదానిని అనుభవించగలము. ఏ దానిని ఆనందించగలము. తల్లికి దూరమైన పుత్రుడు యే సుఖాన్ని అనుభవించలేడు. అందులో సామాన్యమైన తల్లి కాదు దైవము. ఈ దివ్యమైన తల్లి, భవ్యమైన తల్లి, నవ్యమైన తల్లి, నవీనమును అందిచ్చే తల్లి, నిత్యనవీనముతో నిల్చిన తల్లి. ఎప్పటికప్పుడే క్రొత్తగా వుంటుంటాది. ఒక చిన్న విషయాన్ని మీరు గుర్తించుకోండి. అనేకమంది సంవత్సరముల తరబడి ప్రశాంతి నిలయములో నిలుస్తూ వుంటారు. 10 దినములు 15 దినములు నివశించేవారు కూడ వుంటారు. తెల్లవారి వస్తూనే దర్శనము చేసుకుంటారు స్వామిని. ఈ విధముగా ఒక దినము రెండు దినములు చూస్తే చాలదా. కానీ ఆ చూసిన స్వామినే నిత్యము తెల్లవారి చూసినా తిరిగి సాయంకాలము చూడాలని, సాయంకాలము చూస్తే తిరిగి తెల్లవారి చూడాలని యీ విధముగా సంవత్సరములు తరబడి చూడాలనుంటే ఎంత నిత్యసుందరము, నిత్యయవ్వనము. ఒక్కతూరి చూచి తృప్తిపడిపోయినవారు లేరు. తెల్లవారి అందరు నిశ్శబ్దముగా అటువైపునా యిటువైపున కూర్చొని కన్నులన్నియు కూడను ఆ ద్వారము వైపున చూస్తూ వుంటాయి. నిన్న చూసిన స్వామినే కదా యింక యెందుకు చూడాలి మరి. కాదు కాదు. తిరిగి చూడాలి. తిరిగి చూడాలి. ఆ విధానము ఆ ప్రేమయందే యిమిడి వుంటున్నది. నిత్యనూతనముగా వుంటుంటాది. కనుక యీ విధమైన భావములు ఒక దైవానికి భక్తులకు మాత్రమే సన్నిహిత సంబంధము. ఈ సంబంధ బాంధవ్యములు అభివృద్ధిగావించుకోటమే ప్రధానమైన లక్ష్యము. భూమానంద చెప్పాడు 'యిదే మన ఆనందము. ఇదే మన సాయుజ్యము. ఇదే మన సాలోక్యము. ఇదే మన సామీప్యము. ఇలాంటి ఆనందమును అనుభవించటమే మన జీవిత గమ్యము. అన్నాడు అట్టి దైవప్రేమను పెంచుకోటమే ప్రధానమైన సాధన. అన్ని వేదములు బోధించనది అదియే. కనుక ప్రేమమయులై ప్రేమతత్వాన్ని ప్రకటితము గావించుకుంటూ, ప్రేమానందమును అనుభవించటానికి ప్రయత్నము చేయండని ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.